ఆంధ్రజ్యోతి



సత్యసాయికి హారతి..



బాబా మహాసమాధి



స్వర్ణరథంలో సత్యసాయి ప్రతిమ

అట్టహాసంగా సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు

ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితరుల హాజరు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



వేదికపై ఉపరాష్ట్రపతి, సీఎంలు, మంత్రులు, ట్రస్టు సభ్యులు

కదిలింది సాయిరథం

పుట్టపర్తిలో మార్మోగిన సాయినామం

పుట్టపర్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి నామస్మరణతో పుట్టపర్తి మార్మోగింది. పట్టణ వీధులన్నీ కిటకిటలాడాయి. ప్రశాంతి నిలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. హిల్‌వ్యూ స్టేడియంలో సాంస్కృతిక సంబరాలు అంబరాన్నంటాయి. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. స్వర్ణరథంపై సత్యసాయి బాబా చిత్రపటాన్ని ఊరేగించారు. సత్యసాయి స్వర్ణ రథం స్టేడియంలోకి వస్తుండగా గాయకుడు మనో తన పాటతో అరవిందు డోలు వాయిద్యంతో సాగింది. గాయకుల పాటకు భక్తులు లీనమై పులకించిపోయారు. శాంతి వేదిక వరకు సాగిన స్వర్ణ రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు

(మిగతా 7వ పేజీలో...)

సేవల్లో చూపుదాం..

సంఘర్షణలు, ఒత్తిడులతో నిండిన నేటి ప్రపంచానికి భగవాన్ బోధించిన ప్రేమ, ఐక్యత, సేవ వంటి విలువలు మరింత అవసరం. సేవ మానవత్వాన్ని కలుషతుంది. ప్రేమ ద్వేషాన్ని జయిస్తుంది. కుటుంబాల్లో, సమాజంలో, దేశంలో శాంతిని పెంపొందించడం మనందరి బాధ్యత. భగవాన్ వారసత్వాన్ని మాటల్లో కాకుండా సేవల్లో కొనసాగించాలి.

\- ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్


పూర్తి వివరాలు మెయిన్‌లో



రండి సామి వద్దకు..







డ్రోన్‌షో...

మనం చూసిన దైవం..

దేవుళ్లు ఏక్కడో ఒక చోట అవతరిస్తారు. భగవాన్ సత్యసాయి ఈ పుణ్యభూమిని ఎంచుకున్నారు. చిత్రావతి నది ఒడ్డున పుట్టపర్తిని ఆధ్యాత్మికతకు, దైవత్వానికి నిలయంగా మార్చారు. మానవ రూపంలో మనం చూసిన దైవం ఆయన. తన మనో దర్శనం ద్వారా దేశ విదేశాల నుంచి సంపన్నులు, ప్రముఖులను ఆయన సేవా మార్గం అనుసరించేలా చేశారు. డబ్బు, పదవి, పేరు ఉన్నవారు ఎక్కడా లేని ప్రశాంతత పుట్టపర్తిలో పొందారు.

\- సీఎం చంద్రబాబు

జీవితాల్లో వెలుగులు..

భగవాన్ సత్యసాయి ప్రజల్లోనే దేవుడిని చూశారు. ప్రేమతో వారిని గెలుచుకున్నారు. ప్రేమ ద్వారానే ఏదైనా సాధ్యమవుతుందనేది బాబా సందేశం. ప్రభుత్వాలు సేవలు అందించలేని చోటా బాబా సేవలు అందించారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించడం ద్వారా సత్యసాయి ట్రస్ట్ లక్షలాది మంది జీవితాలకు వెలుగు ఇచ్చింది. ప్రభుత్వాలకు సరితూగే స్థాయిలో, కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలకు మించి సేవలను ట్రస్ట్ అందిస్తోంది.

\- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి





• కనువిందు



కోనాపురం వద్ద కనువిందు చేసిన ఇంద్రధనుస్సు

పచ్చని పంటలతో పరచుకున్న పచ్చదనం. చిన్నపాటి వర్షంతో చల్లటి వాతావరణం. ఈ పరిస్థితుల్లో ఇంద్రధనుస్సు కనువిందు చేసింది. కనగానపల్లి మండలంలోని కోనాపురం వద్ద ఆదివారం సాయంత్రం ఏర్పడిన హరివిల్లును స్థానికులు ఎంతగానో ఆస్వాదించారు.

\- కనగానపల్లి, ఆంధ్రజ్యోతి

మాస్టార్ల మెడకు మాక్ అసెంబ్లీ వివాదం

- తపోవనం హెచ్‌ఎం, ఇద్దరు టీచర్లకు షోకాజ్‌లు
- 27న అమరావతికి రావాలని కమిషనర్ ఆదేశాలు

అనంతపురం విద్య, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మాక్ అసెంబ్లీకి విద్యార్థుల ఎంపికలో వివాదం మాస్టార్ల మెడకు చుట్టుకుంది. నియోజకవర్గాల్లో మొదటి స్థానంలో ఎంపికైన విద్యార్థులకు కాకుండా తర్వాత స్థానంలో నిలిచిన వారిని కమిషనరేట్ కార్యాలయం ఎంపిక చేసి పంపించింది. దీనిపై వివిధ నియోజకవర్గాల నుంచి అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు విద్యాశాఖ అధికారులను నేరుగా కలిసి ప్రశ్నించారు. అనంతపురం నియోజకవర్గం నుంచి తపోవనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి అమ్మాయి అలేఖ్య మొదటి స్థానంలో నిలిచింది. ఆ అమ్మాయి పేరు రాకుండా.. మరో అమ్మాయి పేరు రావడంతో ఇది అన్యాయమని శనివారం పాఠశాల హెచ్‌ఎం రాజశేఖర్, టీచర్లు అరుణ, సురేష్ అమ్మాయిని పిలుచుకొని డీఈఓ కార్యాలయానికి వచ్చారు. ఇక్కడ డీఈఓను కలిసి ఇలా అన్యాయం ఎలా చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా అమ్మాయితోపాటు, తల్లి విద్యాశాఖ అధికారులను నిలదీశారు. ఈ విషయం కమిషనర్ విజయరామరాజు, ఆర్జేడీ శామ్యూల్ దృష్టికి వెళ్లడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడి సమయంలో అక్కడికి ఎలా వస్తారని, జాబితాపై ఎలా ప్రశ్నిస్తారని షోకాజ్‌లు ఇవ్వాలని ఆర్జేడీ ఆదేశించారు. నేరుగా కమిషనర్ విజయరామరాజు లైన్‌లోకి వచ్చి అక్కడికి వచ్చిన టీచర్లను ఈనెల 27న తన దగ్గరకు పంపాలని డీఈఓకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో తపోవనం హెచ్‌ఎం, ఆ ఇద్దరు టీచర్లకు షోకాజ్‌లు ఇవ్వడంతో పాటు అమరావతికి వెళ్లి కమిషనర్‌ను కలవాలని డీఈఓ ఉత్తర్వులు జారీచేసారు. ఇలా మాక్ అసెంబ్లీ టీచర్ల మెడకు చుట్టుకోవడం విద్యాశాఖ, టీచర్ వర్గాలలో తీవ్ర చర్చకు దారితీసింది.

అరటి రైతు ఆక్రందన..!

- ఎన్నడూ లేని విధంగా ధర పతనం
- టన్ను రూ.వెయ్యి నుంచి రూ.3వేలే..
- ఆందోళనలో అరటి రైతులు
- గల్ఫ్‌కు ఎగుమతులు చేసే కంపెనీల నిస్తేజం
- కుమ్మక్కైన స్థానిక వ్యాపారులు
- ధర కల్పిస్తామని జిల్లా యంత్రాంగం ప్రకటించినా ఫలితమేదీ..?

అనంతపురం అర్బన్/ తాడిపత్రి/ పుట్లూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా అరటి రైతుకు కష్టకాలం వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అరటి ధర భారీగా పతనమయింది. పక్షం రోజులుగా అరటి ధర అమాంతం తగ్గింది. దీంతో లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు భారీగా నష్టపోతున్నారు. ప్రతి ఏడాది అరటి ధర ఎంత తగ్గినా... రూ.10 వేల నుంచి రూ.15వేలు పలుకుతూ వచ్చింది. ఈ ఏడాది అరటి దిగుబడి బాగానే వచ్చింది. పంట చేతికొందే సమయానికి ధరలు అమాంతం తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. 2024 జనవరి, ఫిబ్రవరి మాసాల్లో అరటి టన్ను రూ.30వేల వరకు పలికింది. గత నెలన్నర క్రితం అరటి టన్ను రూ.15వేలు నుంచి రూ.20వేల వరకు ఉండేది. తర్వాత రూ.6 నుంచి 7వేలకు పడిపోయింది. పక్షం రోజుల నుంచి అరటి నాణ్యత ఆధారంగా టన్ను రూ.వెయ్యి నుంచి రూ.3వేలు దాకా ధర మాత్రమే పలుకుతోంది. దీంతో ఏం చేయాలో తోచని అయోమయంలో అరటి రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఈసారి పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియని అయోమయంలో ఉండిపోయారు.



చెట్టుపైనే కుళ్లిపోతున్న అరటి కాయలు

లాభాలు వస్తాయన్న ఆశతో పంట సాగు..

జిల్లావ్యాప్తంగా 38,984 ఎకరాల విస్తీర్ణంలో అరటి పంట సాగులో ఉంది. గత ఏడాది 27,365 ఎకరాల్లో అరటి పంట సాగయింది. గత ఏడాదితో పోలిస్తే 30 శాతం అధికంగా పంట సాగు విస్తీర్ణం పెరిగింది. పుట్లూరు, పెద్దపప్పూరు, రాప్తాడు, యాడికి, యల్లనూరు, తాడిపత్రి, నార్పల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం తదితర మండలాల్లో అరటి పంట ఎక్కువగా సాగుచేస్తున్నారు. అరటి పంట సాగుతో లాభాలు బాగా వస్తుండటంతో జిల్లాలోని ఇతర రైతులు అరటి పంట సాగుపై మొగ్గు చూశారు. ఎకరాలో అరటి పంట సాగుకు దాదాపు రూ.1.70లక్షలు ఖర్చు అవుతుంది. అరటి మొక్కను పెద్దచేయాలంటే 9నెలల సమయం పడుతుంది. ఈ పంట కోసం ప్రతి రైతు ఎంతో ఆశతో ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈసారి దిగుబడి బాగానే వచ్చింది. ఎకరాకు 15 నుంచి 20 టన్నుల దాకా దిగుబడి వచ్చింది. పంట చేతికొచ్చిన తర్వాత ధరలు భారీగా పడిపోవడంతో అరటి రైతుకు కన్నీళ్లే మిగిలాయి.

పంటను వదిలేస్తున్న రైతులు

ధర తక్కువగా ఉండటంతో పలువురు రైతులు పొలాల్లోనే పంటను వదిలేస్తున్నారు. మరికొందరు దారి మధ్యలో.. వంకల వద్ద పంటను పారేస్తున్నారు. మరికొందరు పంటను దున్నేస్తున్నారు. ధర భారీగా తగ్గడంతో రైతులు నష్టపోతుంటే... అయితే బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు డజన్ అరటి రూ.50 నుంచి రూ.60లకు విక్రయిస్తుండటం గమనార్హం.





సాగుచేసిన అరటి, చెట్టుపైనే పాకానికి వచ్చిన కాయలు

కన్నెత్తిచూడని కంపెనీలు..

జిల్లాలో పండించిన అరటి ఉత్పత్తులను 16 కంపెనీలు గల్ఫ్ దేశాలకు ఎగుమతులు చేస్తూ వస్తున్నాయి. ఈసారి సదరు కంపెనీలు రైతుల నుంచి అరటి పంటను కొనుగోలు చేయలేదు. నాణ్యత లేదన్న సాకుతో కంపెనీలు అరటి పంటవైపు కన్నెత్తి చూడటం లేదు. నాందేడ్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, తదితర ఇతర రాష్ట్రాల్లో అరటి పంట బాగా పండటంతో జిల్లాలో పండించిన అరటి పంట కోసం వ్యాపారులు మొగ్గు చూపడం లేదన్న కారణాన్ని అధికార యంత్రాంగం చెబుతోంది. ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ అన్ని జిల్లాల ఉద్యాన అధికారులు, ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న పలు కంపెనీల ప్రతినిధులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇదే క్రమంలో అరటి ధరలపై నాలుగు రోజుల క్రితం కలెక్టర్ ఆనంద్ స్థానిక వ్యాపారులను పిలిపించి సమావేశమయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కిలో రూ.7.50 నుంచి రూ.8 చొప్పున కొనుగోలు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు.

చూసి వెనక్కి వెళ్లిపోతున్నారు..



ఆరు ఎకరాల్లో అరటి పంట సాగుచేశాను. పంట ధరలు అమాంతం తగ్గిపోవడంతో చాలా మంది వ్యాపారులు చూసి వెనక్కి వెళ్లిపోతున్నారు. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.1.70 లక్షల మేర పెట్టుబడులు వస్తున్నాయి. పంటకు తెగుళ్లు ఉంటే పెట్టుబడి పెరుగుతుంది. దిగుబడి బాగున్నా ధరలు పడిపోవడంతో చెట్లపైనే కాయలు పాకానికి వచ్చి కుళ్లిపోతున్నాయి.

\- రామాంజనేయులు, రైతు, సూరేపల్లి, పుట్లూరు మండలం

పాప కాలేజీ ఫీజు కట్టాలనుకున్నా..



నేను ఆరు ఎకరాల్లో పంట సాగుచేశాను. అరటి కాయలను అమ్మి విజయవాడలో ఇంటర్ చదువుతున్న కుమార్తె కాలేజీ ఫీజు కట్టాలి అనుకున్నాను. కానీ భారీ నష్టాలను చూడాల్సి వస్తోందని అనుకోలేదు. వ్యాపారులేమో కాయలు బాగాలేవని, నాణ్యత తగ్గిందని తక్కువ ధరలకు అడుగుతున్నారు. ఇప్పటికే పెట్టుబడులకు లక్షలాది రూపాయలు అప్పులు చేశాం. ప్రభుత్వం స్పందించి ఆదుకోకపోతే అరటిరైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుంది.

\- వెంకటనారాయణ, అరటి రైతు, వరదాయపల్లి, పెద్దపప్పూరు మండలం

రైల్వే అధికారుల మధ్య ఆధిపత్య పోరు

- డీజిల్, ఎలక్ట్రికల్ సీనియర్ డీఎంఈ మధ్య ముదిరిన వివాదాలు
- ఉన్నతాధికారుల విచారణ?

• వివరాలు 7వ పేజీలో...

వేర్వేరు ప్రమాదాల్లో

ఐదుగురి మృతి

• ఇద్దరికి తీవ్ర గాయాలు

7

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

శెట్టూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఓ యువరైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శెట్టూరు మండలం కరిడిపల్లికి చెందిన తుమాటి చౌదరి (33) అనే రైతు చీనీ, టమోటా తదితర పంటల సాగుకు సుమారు రూ.10 లక్షల దాకా ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో దిక్కు తెలియక శనివారం రాత్రి గ్రామ సమీపంలో పురుగుల మందు తాగాడు. తరువాత ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు, స్థానికులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని చౌదరిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య అనిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



తుమాటి చౌదరి (ఫైల్)

ఆస్పత్రి ధ్వంసం

- వైసీపీ నాయకుడి దౌర్జన్యం
- వాటాదారుల మధ్య విభేదాల నేపథ్యంలోనే..



ధ్వంసమైన శ్రీనివాసా ఆస్పత్రి అద్దాలు

7

రైల్వే అధికారుల మధ్య ఆధిపత్య పోరు

- డీజిల్, ఎలక్ట్రికల్ సీనియర్ డీఎంఈ మధ్య ముదిరిన వివాదాలు
- ఉన్నతాధికారుల విచారణ?

గుంతకల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజనల్ కేంద్రంలోని ఇద్దరు హెచ్ఓడీల మధ్య జరుగుతున్న ఆధిపత్యపోరు చిలికి, చిలికి గాలివానగా మారింది. స్థానిక డీజిల్ షెడ్, ఎలక్ట్రికల్ లోకో షెడ్ హెడ్ ఆఫ్ ద డిపార్టుమెంట్ అధికారులైన సీనియర్ డీఎంఈ (డీజిల్) మంగాచార్యులు, సీనియర్ డీఈఈ వీరయ్య మధ్య ఏర్పడిన వివాదాలు పీక్ స్టేజ్‌కు చేరాయి. మంగాచార్యులుకు ప్రమోషన్ల కారణంగా సీనియర్ డీఎంఈగా ఉన్నతి లభించగా, వీరయ్య ఇండియన్ రైల్వే సర్వీస్ ద్వారా వచ్చిన అధికారి కావడం కూడా వీరి మధ్య పొసగకపోవడానికి కారణంగా కనిపిస్తోంది. ఈ ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య ఏర్పడిన ఘర్షణ వాతావరణానికి తోడు ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లో వారం కిందట జరిగిన ఘటన విచారణకు దారితీసింది. దీనిపై స్పందించిన డీఆర్ఎం ఈ ఇద్దరు అధికారులపై విచారణకు ఆదేశించారు.

సమస్యకు కారణమిదీ..:

గుంతకల్లు రైల్వే డివిజన్ కేంద్రంలో 60 ఏళ్లుగా డీజిల్ షెడ్ ద్వారా డీజిల్ ఇంజన్ల నిర్వహణ, మరమ్మతుల కార్యక్రమం నడుస్తోంది. కాగా మారుతున్న సాంకేతికత కారణంగా గుంతకల్లులో 150 ఎలక్ట్రికల్ లోకోలను మరమ్మతులు చేసే విద్యుత్ లోకో షెడ్‌ను నిర్మించారు. ఈ నేపథ్యంలో డీజిల్ షెడ్‌లో డీజిల్ లోకోల సంఖ్య తగ్గిపోయి వాటి స్థానంలో దాదాపు 150 విద్యుత్ లోకోలు వచ్చి చేరాయి. ఆ విద్యుత్ లోకోలను నిర్వహించే బాధ్యత సీనియర్ డీఎంఈ (డీజిల్) నేతృత్వంలోనే చేపట్టారు. కాగా సీనియర్ డీఎంఈ మరో నాలుగు నెలల్లో రిటైరు కానుండగా, గత నెలలో విద్యుత్ లోకో షెడ్‌కు సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు పోస్టును సృష్టించి సీనియర్ డీఈఈగా వీరయ్యకు ప్రమోషన్ ఇచ్చి ఇక్కడకు పోస్టింగ్ ఇచ్చారు. సీనియర్ డీఈఈగా విధుల్లో చేరిన వీరయ్య తనకు షెడ్‌లో ప్రత్యేక చాంబర్ కావాలని, విద్యుత్ లోకోలను తనకు అప్పగించాలన్న విషయంగా సీనియర్ డీఎంఈ (డీజిల్) మంగాచార్యులుతో స్పర్థ ఏర్పడినట్లు సమాచారం.

అధికారులపై విచారణ

మరమ్మతులు చేయాల్సిన విద్యుత్ లోకోలను తేవడానికి ఉపయోగించే షంటింగ్ డీజిల్ ఇంజిన్‌ను సీనియర్ డీఎంఈ (డీజల్) మంగాచార్యులు ఇవ్వకుండా ఆపేశారని సీనియర్ డీఈఈ వీరయ్య ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తన అనుమతి లేకుండా డీజిల్ ఇంజిన్‌ను సీనియర్ డీఈఈ ఎలా వాడుకుంటారని కినుక వహించిన సీనియర్ డీఎంఈ దానిని ఉద్దేశపూర్వకంగా ఇవ్వడంలేదని చేసిన ఆరోపణల విషయంగా ఈ ఇద్దరు అధికారుల మధ్య వివాదం తారాస్థాయికి చేరి, మాటామాటా పెరిగినట్లు సమాచారం. ఈ వివాదం జోనల్ హెడ్ క్వార్టర్స్‌కు, ఆపైన రైల్వే బోర్డు వరకూ వెళ్లినట్లు తెలిసింది. దీనిపై డీఆర్ఎం సీఎస్ గుప్తా విచారణకు ఆదేశించగా ఏడీఆర్ఎం ద్వారా శని, ఆదివారాల్లో ఈ ఇద్దరు అధికారులను విడివిడిగా పిలిచి ప్రశ్నించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయంగా ఉన్నతాధికారుల వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆదివారం కావడంతో వారు అందుబాటులోకి రాలేదు.

చెన్నై దాహార్తి తీర్చిన సత్యసాయి

- తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

పుట్టపర్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చెన్నై దాహార్తిని తీర్చిన మహనీయుడు సత్యసాయి బాబా అంటూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన సందేశంలో పేర్కొన్నారు. సత్యసాయి శత జయంతి వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి పంపిన సందేశాన్ని ఆ రాష్ట్ర మంత్రి శేఖర్ బాబు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌కి అందజేశారు. పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి సందేశాన్ని వ్యాఖ్యాత చదివారు. చెన్నై దాహార్తి తీర్చేందుకు, తమిళనాడు సాగు అవసరాలకు సత్యసాయి కృష్ణా జలాలు అందించారని కొనియాడారు. సత్యసాయి అందిస్తున్న ఉచిత వైద్యం, విలువలతో కూడిన విద్య, గ్రామీణ ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీరు ఎనలేనివన్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు, సేవా సంస్థలు నిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ధర్మవరంరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా ఉంటుందని, ఇందులో 10కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. ఎంపికైన వారు పెనుకొండ, కడప, పాలసముద్రం, అనంతపురం, బెంగళూరు ప్రాంతాల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. పదో తరగతి నుంచి పీజీ పూర్తిచేసి 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వారు అర్హులని పేర్కొన్నారు. జాబ్‌మేళాకు వచ్చేవారు నైపుణ్యం.ఏపీ.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి



సురేష్, సల్లప్ప, తిమ్మారెడ్డి (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బేల్దారి పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో ఇద్దరు మృతి చెందగా.. నడుచుకుంటూ వెళుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు, ద్విచక్ర వాహనం బోల్తాపడి మరొకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి చెందిన సురేష్ (48), మానిరేవు గ్రామానికి చెందిన సల్లప్ప (38) ఇద్దరూ బేల్దారి పని ముగించుకుని శనివారం రాత్రి 12 గంటల సమయంలో ద్విచక్రవాహనంలో ఇళ్లకు బయల్దేరారు. గోళ్ల సమీపంలో అతివేగంగా అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ఇద్దరూ చెల్లాచెదురుగా పడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సురేష్‌కు భార్య అరుణ, పిల్లలు అజయ్, నందిని ఉన్నారు. సల్లప్పకు భార్య అనిత, పిల్లలు అనిల్, అంజి ఉన్నారు. ఇరు కుటుంబాల్లో ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో అనాథలుగా మిగిలారు. ఒకే ఇంటికి చెందిన అక్కా చెల్లెళ్లు అరుణ, అనితను పెళ్లి చేసుకున్నారు. మృతులు ఇద్దరూ తోడళ్లుల్లు. కారు అనంతపురం నగరానికి చెందినదిగా గుర్తించారు. కారు, ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని దొడగట్ట రోడ్డులో శనివారం రాత్రి నడుచుకుంటూ వెళ్తున్న తిమ్మారెడ్డి(38) అనే వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొట్టింది. తిమ్మారెడ్డితో పాటు అశ్వర్థ, రామాంజనేయులు ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లారు. ముగిసిన తర్వాత వాకింగ్ చేద్దామంటూ ముగ్గురూ రోడ్డుపైకి వచ్చారు. దొడగట్ట నుంచి ద్విచక్రవాహనంలో భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి వచ్చి ఢీ కొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. తిమ్మారెడ్డిని అనంతపురం తీసుకెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య భారతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం బోల్తాపడి..

గోరంట్ల: మండలంలోని పుట్టపర్తి రహదారిలో కరావులపల్లితండా సమీపంలోనిబైపాస్‌రోడ్డులో ద్విచక్రవాహనం బోల్తాపడి దూదోళ్ల వెంకటేష్ (35) అనే వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. గోరంట్ల మండలంలోని వానవోలు ఎస్సీ కాలనీకి చెందిన దూదోళ్ల నారాయణ కుమారుడు వెంకటేష్ ద్విచక్రవాహనంపై పుట్టపర్తి మండలం కప్పలబండ గ్రామంలోని భార్య, పిల్లలను తీసుకురావడానికి వెళ్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయం తగిలి చెవి, ముక్కు నుంచి రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ షేక్షావలి తెలిపారు.

బొలెరో ఢీకొని ఒకరు..

ఉరవకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కణేకల్లు మండలం సొల్లాపురం గ్రామానికి చెందిన పవన్ (30) మరణించాడు. రాము తీవ్రంగా గాయపడ్డాడు. వీరిద్దరూ వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి సమీపంలో బైక్‌పై వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన బొలెరో ఢీ కొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వీరిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పవన్ మరణించాడు. పోలీసులు ఘటనపై ఆరా తీస్తున్నారు.

కదిలింది సాయిరథం..



మహారథం ముందు ఆర్‌జే రత్నాకర్



కలశాలతో వస్తున్న మహిళలు

(5వ పేజీ తరువాయి)

ఎగబడ్డారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డితోపాటు దేశవిదేశాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఉదయం హిల్ వ్యూ స్టేడియంలో ప్రముఖ గాయకుడు మనో, శివమణి సంగీత విభావరితో అలరించారు. అన్నిరాష్ట్రాల సత్యసాయి భక్త బృందాలు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. సింగర్ మనో పాట పాడుతుండగా.. సత్యసాయి స్వర్ణరథం స్టేడియంలోకి ప్రవేశించింది. దీంతో భక్తుల సాయినామంతో స్టేడియం దద్దరిల్లింది. సాయి రథం ముందు వేదపారాయణం చేస్తూ సాగారు. వేదం, నగర సంకీర్తన, భజన ఒకే వేదికపై ఆధ్యాత్మికత, ఏకత్వాన్ని ప్రతిబింబించాయి. స్వర్ణ రథంపై దివ్యకాంతులతో విరాజిల్లుతున్న సత్యసాయి బాబా దర్శనంతో భక్తులు తన్మయత్వం పొందారు.

సాయి కుల్వంతులో..

సత్యసాయి శత జయంతి వేడుకలను ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభామండపంలో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. విద్యార్థుల వేదపఠనం, భక్తి నివేదనం పేరిట భక్తి గీతాల ఆలాపన చేపట్టారు. వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ప్రశాంతి నిలయం పూర్తిగా నిండిపోయింది. అందులో చోటులేక బయటే భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. పుట్టపర్తి వీధులు కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సెంట్రల్ ట్రస్టు సభ్యులు, సేవాదళ్, జిల్లా అధికార, పోలీసు యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నాయి. దీంతో బాబా శతజయంతి ఉత్సవాలు దిగ్విజయంగా ముగిశాయి. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు నారాయణ సేవతోపాటు పలువురు భక్తులు అన్నదానం చేశారు.

ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం

ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. వేడుకల మొదటి రోజు నుంచి ప్రముఖులు సందర్శిస్తున్నారు. దీంతో భద్రత కల్పించడం పోలీసు శాఖకు సవాల్‌గా మారింది. కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ నిరంతరం జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ.. గడిపారు.



భక్తులతో కిటకిటలాడుతున్న హిల్‌వ్యూ స్టేడియం



ప్రత్యేక ఆకర్షణగా ప్రవేశ ద్వారం



సాంస్కృతిక కార్యక్రమాలు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత, అనగాని సత్యప్రసాద్



ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే సింధూరారెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రికి ఘనస్వాగతం

పుట్టపర్తి టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలలో పాల్గొనడానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం పుట్టపర్తికి విచ్చేశారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో తెలంగాణ ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, కందుల దుర్గేష్, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, ఎంఎస్.రాజు, హిందూపురం ఎంపీ బీకే.పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్‌లు పుష్పగుచ్ఛాలతో ఘనస్వాగతం పలికారు. మంత్రి సవిత తెలంగాణ ముఖ్యమంత్రికి జాతీయ చిహ్నం అయిన అశోక స్థంభంను బహూకరించారు.

రేవంత్ రెడ్డితో సమావేశం: సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో పాల్గొనడానికి ఆదివారం పుట్టపర్తి చేరుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. విమానాశ్రయం లాంచ్‌లో సమావేశమై శత జయంతి ఉత్సవాలకు వచ్చినందుకు రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం చంద్రబాబుకు వీడ్కోలు



సీఎం చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న మాజీ మంత్రి పల్లె, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, కందికుంట వెంకటప్రసాద్

పుట్టపర్తి టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో పాల్గొని తిరుగు ప్రయాణమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు వీడ్కోలు పలికారు. పుట్టపర్తి విమానాశ్రయంలో మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్.రాజు, హిందూపురం ఎంపీ బీకే.పార్థసారధి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులతో పాటు పలువురు నాయకులు, అధికారులు ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికారు.

అంధకారంలో భవిత..!

- చీకట్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు పాఠాలు
- భవిత కేంద్రాన్ని అప్పగించని కాంట్రాక్టర్

కనగానపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నా.. అధికారుల అలసత్వం, పర్యవేక్షణ లోపంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సొంత భవనం ఉన్నా పిల్లలను చీకటి గదిలో పెట్టి చదువులు చెబుతున్న దయనీయ స్థితి ఇది. ప్రభుత్వం పిల్లల కోసం మంజూరు చేసిన నిధులతో పక్కా భవన నిర్మాణం పూర్తి చేసినా.. అధికారులకు అప్పగించకుండా, సొంత అవసరాలకు వాడుకుంటున్నాడో కాంట్రాక్టర్. బుద్ధిమాంద్యం, దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రతి మండల కేంద్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో భవిత కేంద్రాన్ని నిర్వహిస్తోంది. ఇందులో ఐఈఆర్‌పీలను నియమించి ప్రత్యేక అవసరాల పిల్లలకు తరగతులు నిర్వహిస్తున్నారు. కనగానపల్లి మండల కేంద్రంలో 15 మంది దివ్యాంగ పిల్లలు ఉన్నారు. వీరికి ప్రత్యేక భవనం లేక పోవడంతో ప్రాథమిక పాఠశాలలో ఓ గదిని తీసుకుని చదువు చెబుతూ.. ఆటలు ఆడిస్తున్నారు. వారానికి ఒకసారి ఫిజియోథెరపిస్టు కేంద్రానికి వచ్చి అవసరమున్న పిల్లలకు వ్యాయామాలు చేయించి, తల్లిదండ్రులకు మెళకువలు నేర్పిస్తారు. వీరి అవసరాలను గుర్తించిన గత తెలుగుదేశం ప్రభుత్వం సర్వశిక్షా అభయాన్ పథకం ద్వారా 2017-2018లో భవిత కేంద్రానికి పక్కా భవన నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్టరు భవనాన్ని విడతల వారిగా పూర్తి చేశాడు. వైసీపీ ప్రభుత్వంలో భవిత కేంద్రాలపై పర్యవేక్షణ లేక పోవడంతో భవనాన్ని సొంత అవసరాలకు వాడుకుంటున్నాడు. భవనం పూర్తయినప్పటికీ పిల్లలకు పాత పాఠశాల భవనంలోని చీకటి గదిలో తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై సమగ్ర శిక్ష జేఈ చంద్రమోహన్ వివరణ కోరగా.. కాంట్రాక్టరుకు బిల్లు పెండింగ్ ఉందని తమకు తాళాలు ఇవ్వలేదని అన్నారు.



చీకటి గదిలో చదువుకుంటున్న ప్రత్యేక అవసరాలుగల పిల్లలు

భవనాన్ని అప్పగించమని ఆదేశించాం

కనగానపల్లి నూతన భవితా కేంద్రాన్ని 10 రోజుల క్రితమే తనిఖీ చేయడం జరిగింది. పెండింగ్ పనులు పూర్తి చేసి వారంలో భవనాన్ని సంబధిత అధికారులకు అప్పగించమని కాంట్రాక్టర్, ఇంజనీర్‌ను ఆదేశించడం జరిగింది. దీనిపై అలసత్వం వహిస్తే సహించేది లేదని, కేంద్రాన్ని తెరిచేందుకు చర్యలు చేపడుతామన్నారు.

- దేవరాజు, ఏపీసీ, సమగ్ర శిక్ష

ఆస్పత్రి ధ్వంసం

- వైసీపీ నాయకుడి దౌర్జన్యం
- వాటాదారుల మధ్య విభేదాల నేపథ్యంలోనే..

అనంతపురం వైద్యం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వాటాల్లో పంచాయితీ నేపథ్యంలో అనంతపురంలోని సాయినగర్‌లో గల శ్రీనివాసా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆదివారం ధ్వంసం చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు అనంతపురం టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయినగర్ మూడో క్రాస్‌లో శ్రీనివాసా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేశారు. అందులో శ్రీనివాసరావు, వైసీపీ నాయకుడు సత్యనారాయణరెడ్డి, రాఘవేంద్ర, న్యాయవాది శ్రీలతారెడ్డి వాటాదారులు. ఈ నేపథ్యంలో వాటాల విషయమై సత్యనారాయణరెడ్డి ఆగ్రహించారు. తన వాటా వెనక్కివ్వాలనీ, లేకుంటే వాటాదారుగా చేర్చుకోవాలని డిమాండ్ చేశాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సత్యనారాయణరెడ్డి.. తన అనుచరులతో వెళ్లి హాస్పిటల్‌పై దాడి చేశాడు. మొత్తం ధ్వంసం చేశారు. ఆస్తినష్టం, దాడిచేసిన వారు తదిర వివరాలు కేసు విచారణలో వెల్లడవుతాయని సీఐ శ్రీకాంత్ పేర్కొన్నారు.

మూడేళ్లుగా వివాదం

అనంతపురం జిల్లా కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామ వైసీపీ మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి. అనంతపురంలో శ్రీనివాస ప్రైవేటు హాస్పిటల్ భాగస్వామిగా ఉన్నాడు. మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ అనుచరుడిగా, నాయకునిగా వైసీపీ ప్రభుత్వంలో చలామణి అయ్యాడు. అనంతపురం అర్బన్ వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అనుచరుడిగా నగరంలో అక్రమాలకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీనివాసా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ బ్రాంచ్-2ని సాయినగర్ మూడో క్రాస్‌లో ఏర్పాటుచేశారు. ప్రారంభానికి అంతా సిద్ధం చేశారు. వాటాల విషయంలో సత్యనారాయణరెడ్డి వాదిస్తూ వస్తున్నారు. మూడేళ్లుగా వివాదం నడుస్తోంది. దీనిపై వైసీపీ హయాంలో అప్పటి మంత్రి, పోలీసు ఉన్నతాధికారి పంచాయితీ కూడా చేసినట్లు తెలిసింది.

రూ.3.5కోట్ల నష్టం

వైసీపీ నేత సత్యనారాయణరెడ్డి తన అనుచరులతో చేసిన దాడితో రూ.3.5కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని లాయర్ శ్రీలతా రెడ్డి ఫిర్యాదు చేశారు. ఫర్నీచర్, ఏసీలు, ఎలివేషన్ వర్క్స్ ఇలా అన్నింటినీ ధ్వంసం చేసినట్లు కేసు పెట్టారు. ఆ మేరకు కేసు నమోదుచేసి, దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.



ధ్వంసమైన ఆస్పత్రి లోపలి భాగం

టీడీపీ నాయకుడి డ్రిప్ పరికరాలు ధ్వంసం

- ట్రాక్టరును డ్యాంలోకి తోసేసిన దుండగులు



ధ్వంసమైన పరికరాలు



డ్యాంలో వదిలిన ట్రాక్టర్

వజ్రకరూరు(ఉరవకొండ), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని జరుట్లరాంపురంలో టీడీపీ బూత్ కన్వీనర్ రామాంజనేయులు పొలంలోని వ్యవసాయ పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రామాంజనేయులు భార్యతో కలిసి శనివారం ట్రాక్టర్‌లో తోటలోని పొలం పనులకు వెళ్లారు. పొలం పనులు చేస్తున్న సమయంలో బంధువులు చనిపోయినట్లు సమాచారం వచ్చింది. దీంతో పొలం పనులు వదిలేసి చెన్నేకొత్తపల్లి మండలం బసినేపల్లికి వెళ్లారు. ఆదివారం ఉదయం అతడి ట్రాక్టర్ పెనకచెర్ల డ్యాంలో ఉండడాన్ని గుర్తించి సమాచారమందించారు. పొలంలోని డ్రిప్ పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సుమారుగా రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ మహానంది, ఎస్ఐ నాగస్వామి పరిశీలించారు. తనపై కక్షతోనే గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టరును తోసుకెళ్లి వదిలారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఘనంగా సత్యసాయి శత జయంతి వేడుకలు



కలెక్టరేట్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేసీ

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శతజయంతిని రాష్ట్ర వేడుకగా అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆదివారం జిల్లా అధికారులు సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాలలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ మాట్లాడుతూ... సత్యసాయి బాబా బోధనలు విశ్వ ప్రేమ, సేవ, శాంతి అనే భావాలను విస్తరింపజేశాయన్నారు. ఆయన అందించిన విద్య, వైద్యం, నీటి సరఫరా తదితర సేవలు నేటికీ కొనసాగుతుండడం అభినందనీయమన్నారు. డీఆర్‌ఓ మలోల మాట్లాడుతూ... సత్యసాయి బాబా మానవసేవే మాధవ సేవ అని అందరికీ ప్రేరణగా, ఆదర్శనీయులుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ ఏపీ వీరశైవ లింగాయత్ సంక్షేమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, వాల్మీకి కార్పొరేషన్ పుట్టా లక్ష్మీనరసింహమూర్తి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనరసింహులు, రజక సంక్షేమ కార్పొరేషన్ నుంచి పరమేశ్వర్, సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు రామచంద్రమూర్తి, బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

●అనంతపురం విద్య: జిలాకేంద్రంలోని గ్రంథాలయంలో సత్యసాయి బాబా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా చిత్రపటానికి పూజలు చేశారు. గ్రంథాలయశాఖ జిల్లాకార్యదర్శి రమ, డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న సహాయకార్యదర్శి గోవిందు, రిటైర్డ్‌టీచర్ శ్రీరాములు, కవి అంకె రామలింగయ్య, ఇతరసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

●అనంతపురం క్లాక్‌టవర్: పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మేయర్ మహ్మద్ వసీం... సత్యసాయిబాబు శతజయంతి వేడుకలను నిర్వహించారు. సందర్భంగా బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, కమల్ భూషణ్, ఇషాక్, రహంతుల్లా, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, శీనా తదితరులు పాల్గొన్నారు.

●చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఎన్ఎస్‌గేటులో సత్యసాయిబాబా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రామగిరి మండల బీజేపీ కన్వీనర్ చిత్రాశివయ్య, నాయకుడు శ్రీనాథ్ కేక్ కట్ చేశారు.

ఆకట్టుకున్న సత్యసాయి చిత్రం

రామగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు మహాత్మాబా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో పని చేసే ఆర్ట్ టీచర్ శ్రీరాములు భగవాన్ సత్యసాయి బాబా చిత్రాన్ని ప్రత్యేకంగా చిత్రీకరించారు. ఆదివారం సత్య సాయి బాబా శత జయంతి సందర్భంగా పెన్నుతో చిత్రాన్ని గీశారు. అది ఆకట్టు కుంటుండడంతో శ్రీరాములును తోటి ఉపాధ్యాయులు అభినందించారు.



పెన్నుతో గీసిన బాబా చిత్రం

ఘనంగా సత్యసాయి జయంతి



సత్యసాయిబాబా చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా భట్రాజుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శారదానగర్ తారకనాథ్‌కాలనీలోని వివేకానంద ధ్యానమందిరంలో సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు చేశారు. అలాగే సాయినామస్మరణలు, భజనలు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి మనోహర్ కుమార్, కోశాధికారి అక్కిరాజు మారుతీరాజు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

శింగనమల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తమ స్నేహితురాలు అనారోగ్యంతో మృతి చెండడంతో ఆమె కుటుంబానికి స్నేహితులు ఆర్థిక సాయం అందజేశారు. శింగనమల జిల్లా పరిషత్ పాఠశాలలో 2004లో పదో తరగతి చదివిన వెస్టు నరసాపురం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి గత రెండు నెలలు కిందట అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో క్లాస్‌మేట్స్ రూ. లక్షను పోగు చేసి ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. స్నేహితులు గోవర్ధన్‌రెడ్డి హరి, పెద్దన్న, గజేంద్రనాయుడు. పెద్దయ్య, రవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.47

అనంతపురంరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో ఆదివారం టామోటాలు కిలో గరిష్ఠంగా రూ.47తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్‌యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపా రు. అలాగే కనిష్ఠంగా రూ.24, సరాసరిగా రూ.30తో విక్రయాలు జ రిగాయన్నారు. మార్కెట్‌కు 1875 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు.

చెత్తగా.. ఏడీసీసీ బ్యాంకు ఆవరణం

● ముళ్లపొదలు.. చెత్తాచెదారంతో నిండిపోయిన దుస్థితి ● అధికమైన విష పురుగుల సంచారం



ఏడీసీసీ బ్యాంకు వెనుకవైపున పిచ్చిమొక్కలు



కుప్పగా చెత్తాచెదారం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలు తిరిగే ప్రాంతం పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు, చెత్తాచెదారంతో నిండిపోయి విష పురుగులకు ఆవాసంగా మారింది. నగరంలోని సుభాష్‌రోడ్డులో గల ఎన్టీఆర్ సహకార భవన్ ప్రాంగణంలో ఈ దుస్థితి నెలకొంది. ఆ ప్రాంగణంలో ఉన్న ఏడీసీసీ బ్యాంకు వెనుకవైపున సుమారు ఎకరా స్థలం ఉంది. అది ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, చుట్టు పక్కల నివాసాల నుంచి వచ్చే మురుగు, చెత్తతో నిండిపోయింది. దీంతో విషపురుగుల సంచారం అధికమైంది. ఏడీసీసీ బ్యాంకు వెనుకవైపు సహకార శాఖ జిల్లా ఆడిట్ ఆఫీసర్ కార్యాలయం, సహకార ఉద్యోగుల సంఘం కార్యాలయం ఉన్నాయి. వీటితోపాటు ఏళ్ల క్రితం నిర్మించిన శిథిలావస్థకు చేరిన భవనమూ ఉంది. అక్కడ చెత్త అధికమై విషపురుగులు సంచరిస్తుండడంతో బ్యాంకుకు వచ్చే ఖాతాదారులతో పాటు ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. అయినా ఆవరణను శుభ్రం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. నగర నడిబొడ్డున ఉన్న ఈ స్థలాన్ని ఇలా చెత్తగా వదిలేయడం పట్ల అనేక మంది ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా ఆవరణలో చెత్తాచెదారాన్ని, కంపచెట్లను తొలగించాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన భవనం

అణగారిన వర్గాల అభ్యున్నతికి
ఐక్యపోరాటాలు అవసరం



అభివాదం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభ్యున్నతికి ఐక్యపోరాటాలు సాగించాల్సిన అవసరం ఉందని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. స్థానిక పాతూరులోని గిరిజన భవన్‌లో ఆదివారం గిరిజన ప్రజా సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున నాయక్ అధ్యక్షతన ఆవిర్భావ సభ జరిగింది. ఇందులో ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు పూర్తి అయినప్పటికీ అణగారిన వర్గాల వారు కూడు, గూడు, నీడ కోసం పరితపించడం బాధాకరమన్నారు. అడవిజాతి బిడ్డలైన గిరిజనుల పేదరికం నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో గిరిజనులకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన గిరిజన హక్కులను అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి ప్రజా ఉద్యమాలతో గిరిజనులను చైతన్యం చేస్తామన్నారు. అనంతరం ఐక్యతసంఘీభావంగా నాయకులు అభివాదం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కేశవనాయక్, జయరామ్ నాయక్, ఎస్సీ, ఎస్టీ జేఏసీ అధ్యక్షుడు సాకే హరి, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా చంద్రమోహన్, ఎస్సీ ఎస్టీ ప్రజా సంఘాల ప్రతినిధి రవిరాజ్, ఎస్టీ నాయకులు శ్రీనివాస్ నాయక్, బాలాజీనాయక్, నారాయణస్వామి నాయక్, విద్యార్థి సంఘం నేత సురేష్‌యాదవ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ విద్యార్థులకు బహుమతులు

అనంతపురం రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఐఈఈఈ హైదరాబాద్ రిలయబిలిటీ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. ఆదివారం సొసైటీ ఈధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా పోటీలు నిర్వహించారు. మొత్తం 490మంది విద్యార్థులు పోటీలకు రిజిస్టర్ చేసుకున్నారు. వీరిలో 281మంది పాల్గొన్నారు. ఇందులో ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ విద్యార్థి సంజన మొదటి బహుమతి, మెకానికల్ విభాగానికి చెందిన అలేఖ్య ద్వితీయ బహుమతి, సీఎస్‌ఈ విభాగానికి చెందిన నీలిమా ఆరో బహుమతి సాధించారు.

నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ

అనంతపురంరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్య ల పరిష్కారం కోసం ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ సంస్థలో మొట్టమొదటి సారిగా డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి సోమవారం ఈకార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతపురం జిల్లా వినియోగదారులు 9133331912ను శ్రీసత్య సాయి జిల్లా వారు 8977716661ను సంప్రదించాలని సూచించారు.

తడబడి నిలబడిన ఆంధ్రా

● సెంచరీతో రాణించిన లోహిత్



తలపడుతున్న ఆంధ్రా, ఒడిశా జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఒడిశాతో పోరులో మొదటిరోజు ఆంధ్రా తడబడి నిలబడింది. స్థానిక ఆర్డీటీ స్టేడియం రాయలసీమ క్రికెట్‌గ్రౌండ్‌లో బీసీసీఐ కూచ్ బెహరా ట్రోఫీ అండర్-19 ఆంధ్రా-ఒడిశా మ్యాచ్ ఆదివారం ప్రారంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్రా జట్టు 80 ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 246 పరుగులు చేసింది. మొదట లాంచ్ సమయానికి 56 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన ఆంధ్రా జట్టుకు బ్యాటర్ లోహిత్ లక్ష్మీనారాయణ సెంచరీతో (101), ఏఎన్‌వీ లోహిత్ 60 పరుగులతో ఆదుకున్నారు. సీజన్‌లో మంచి జోరు మీదుతున్న వీరారెడ్డి పరుగులేమీ చేయకుండానే పెవిలియన్ బాట పట్టాడు. జయంత్ కృష్ణ, మన్విత్‌రెడ్డి చెరో 21 పరుగులు చేశారు. ఒడిశా బౌలర్లు రాజ్ యాదవ్ 3 వికెట్లు, సంబిత్‌బేజా 2 వికెట్లు తీశారు. బీసీసీఐ రెఫరీ వరుణ్‌కుమార్, అంపైర్లు జై సంఘని, సబిసాచి సర్కార్ మ్యాచ్‌ను పర్యవేక్షించారు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి భీమలింగారెడ్డి, సహాయకార్యదర్శి మురళీకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను కాపాడుకోవాలి

●కర్ణాటక ఉపలోకాయుక్త చీఫ్ జస్టిస్ వీరప్పన్
●ఘనంగా మౌనగిరి క్షేత్రం ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

రాప్తాడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కర్ణాటక ఉపలోకాయుక్త చీఫ్ జస్టిస్ వీరప్పన్ అన్నారు. మండలంలోని హంపాపురం సమీపంలో గల మౌనగిరి క్షేత్రంలో అభయాంజనేయస్వామి ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. తర్వాత మాట్లాడుతూ... సంప్రదాయ కళలను నేటితరానికి తెలియపరచడంతో పాటు రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే సంప్రదాయ కలల పట్ల ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. భరతనాట్యం, కోలాటం, కూచిపూడి కళలు మన సంస్కృతీ సంప్రదాయాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం ఆయా కళల్లో ప్రతిభ చూపినపలువురు కళాకారులకు ఆయన ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ న్యాయాధికారి సత్యనారాయణ సింగ్, ఆలయ నిర్వాహకులు ఈశ్వరయ్య, చంద్రమోహన్, మధు, గురుసాయి తదితరులు పాల్గొన్నారు.

మూడురోజుల పాటు వేడుకలు..

మౌనగిరి క్షేత్రంలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఈశ్వరయ్య తెలిపారు. ముగింపు రోజు మంగళవారం ఆంజనేయస్వామికి 1000 లీటర్ల పాలతో మహాభిషేకం చేయనున్నట్లు చెప్పారు. 10 వేల మందికిపైగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నామన్నారు.



ఆంజనేయస్వామి విగ్రహ వద్ద కర్ణాటక ఉపలోకాయుక్త చీఫ్ జస్టిస్ వీరప్పన్ తదితరులు

స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు స్టడీసర్కిల్ ఏర్పాటు చేయాలని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవి శంకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకునేందుకు ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో లక్షలాది రూపాయలు ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమతలేదన్నారు. వారి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వెంటనే స్టడీసర్కిల్‌ను ఏర్పాటు చేసి, శాశ్వత ప్రాతిపదికన నిర్వహించాలని తెలిపారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఆయా వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి వెచ్చించాలన్నారు. ఈ విషయమై ఇప్పటికే మంత్రులు, కలెక్టర్‌కు విన్నవించామని చెప్పారు.

శైలజానాథ్ కుటుంబానికి పరామర్శ

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త సాకే శైలజానాథ్ మాతృమూర్తి సాకే గంగమ్మ మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి కొండ్రు మురళి ఆదివారం పరామర్శించారు. నగరంలోని శైలజానాథ్ నివాసానికి వెళ్లి అక్కడి సాకే గంగమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం శైలజానాథ్‌ను, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

చెస్ పోటీల్లో ఉదయ్, శ్రీహా ప్రతిభ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో ఉదయ్, శ్రీహా ప్రతిభ చాటారు. తమిళ నాడులోని హోసూరులో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న లిటిల్ ఇంగ్లాండ్ 5వ ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్-2025 పోటీలు ఆదివారం ముగిశాయి. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 200మంది పాల్గొన్న పోటీల్లో జిల్లా నుంచి ఉదయ్‌కుమార్ నాయుడు, శ్రీహ పాల్గొన్నారు. సీనియర్ కేటగిరిలో ఉదయ్‌కుమార్ నాయుడు రన్నరప్‌గా నిలిచాడు. అండర్-15 బాలికల కేటగిరిలో శ్రీహ తృతీయ స్థానంలో నిలిచింది. వారికి తమిళనాడు చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ప్రగదీష్, టోర్నీ డైరెక్టర్ లోకేష్ బహుమతులు అందజేసి అభినందించారు.



బహుమతులు అందుకుంటున్న ఉదయ్‌కుమార్, శ్రీహ

'బాగా పని చెయ్.. భవిష్యత్తు ఉంటుంది'

అనంతపురం క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కష్టపడి బాగా పని చేసుకోవాలని, దీంతో మంచి భవిష్యత్తు ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్పకు సూచించారు. పుట్టపర్తిలో జరిగిన సత్యసాయి జయంతి వేడుకలకు హాజరైన ముఖ్యమంత్రి ఆదివారం రాత్రి విజయవాడకు తిరుగుపయణమయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్టీ కమిషన్ సభ్యుడిగా తనకు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సీఎం స్పందిస్తూ బాగా చేసుకో..మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు. రాష్ట్రమంతా తిరిగి ఎస్టీలకు న్యాయం చెయ్" అంటూ సీఎం తెలిపినట్లు వెంకటప్ప తెలిపారు.



సీఎం చంద్రబాబుకు నమస్కరిస్తున్న వెంకటప్ప

దేశంలో ఆందోళనకరంగా రాజకీయాలు

● సీపీఐ మైనార్టీ విభాగ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జాఫర్



జాఫర్‌ను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రస్తుత రాజకీయాలు ఆందోళనకరంగా ఉన్నాయని సీపీఐ మైనార్టీ విభాగం ఆల్‌ఇండియా తంజీమ్-ఏ-ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెట్టి విభజించు పాలించు విధానాలను అమలు చేస్తోందని మండిపడ్డారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సీపీఐ 25వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ప్రముఖ మైనార్టీ నాయకుడు బాబాషా అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు జగదీష్, జాఫర్‌తో పాటు పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ... రాజ్యాంగ సంస్థలు అధికార పార్టీకి అనుకూలంగా పని చేయడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు ఏర్పడుతోందన్నారు. ప్రతి ఎన్నికల ముందు అల్లర్లు, బాంబు దాడులు జరగడం సహజం కావడం దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమన్నారు. ప్రశ్నించే ప్రజలపై దాడులు పెరగడం దేశం ఎదుర్కొంటున్న అత్యంత పెద్ద ప్రమాదమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆల్ ఇండియా తంజీమ్-ఏ-ఇన్సాఫ్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పౌరహక్కులు, సామాజిక న్యాయం, మత సహనాన్ని కాపాడేందుకు విస్తృత పోరాటాలు చేస్తోందన్నారు. అనంతరం జాఫర్‌ను పలువురు మైనార్టీ నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో నాయకులు మల్లికార్జున, దాదాగాంధీ, సంతోష్‌కుమార్, సాకే హరి, లింగమయ్య, అల్లీపీరా, చాంద్‌బాషా, మున్నా, రాజు, జానకి, మేహమూదా, యశోదమ్మ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో యథేచ్ఛగా చోరీలు

● పనిచేయని సీసీ కెమెరాలు.. అలసత్వం వహిస్తున్న పోలీసులు
● రాత్రివేళల్లో రెచ్చిపోతున్న దొంగలు

ఆత్మకూరు నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో విచ్చలవిడిగా దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో దొంగలు రెచ్చిపోతున్నారు. సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. పోలీసులు పట్టించుకోవడం లేదు. దీంతో ఇదే అదునుగా దొంగలు పెట్రేగిపతున్నారు. మండలంలో 17గ్రామ పంచాయతీల్లో 40కి పైగా సీసీ కెమెరాలను బిగించారు. అయితే ఇప్పటివరకు ఒక దొంగను కూడా అవి పట్టించలేకపోయాయి. సీసీ కెమెరాలు దిష్టి బొమ్మల్లా మారాయని, అవి పగలు మాత్రమే పని చేస్తున్నాయని, రాత్రి సమయాల్లో పని చేయడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామాల్లో దొంగలు పడి విచ్చలవిడిగా గొర్రెలు, పొట్టేళ్లు, కోళ్లు, ఆలయాల్లో ఆభరణాలు తదితరాలను సునాయాసంగా చోరీ చేస్తున్నారు. గ్రామాల్లో పర్యటించాల్సిన పోలీసులు కూడా పోలీస్ స్టేషన్‌కు పరిమితమయ్యారని గ్రామాల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇటీవల మండలకేంద్రం సమీపంలో ఓ రైతు షెడ్డులో లక్షరూపాయలు విలువ చేసే పొట్టేళ్లను, రూ.60 వేలు విలువ చేసే కోళ్లను అపహరించారు. అలాగే నాలుగురోజులు క్రితం స్టేట్ బ్యాంకు సమీపాన రాత్రి సమయంలో రెండు పొట్టేళ్లను అపహరించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే హేలనగా మాట్లాడారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇదిలా ఉండగా మదిగుబ్బలోని ఓ ఆలయం లో ఇటీవల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయని పూజారి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసులు దొంగలను నిలవరించాలని లేకుంటే ప్రజలు రాత్రి వేళల్లో నిద్రలు లేని రాత్రులు గడపాల్సివస్తుందని ప్రజలు అంటున్నారు.

దొంగలపై ప్రత్యేక నిఘా ఉంచాం..

గ్రామాల్లో గొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాం. బాధితులు దొంగతనాలు జరిగాయని ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ మేరకు విచారణ చేస్తున్నాం. దొంగలను విడిచి పెట్టం. వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. ప్రజలు కూడా కొత్తవ్యక్తులపై నిఘా ఉంచి సమాచారం ఇవ్వాలి. అలాగే అవసరమైన, విలువైన వాటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రజలకు అండగా నిలుస్తాం. ఎవరూ భయపడాల్సిన పనిలేదు.

-లక్ష్మణరావు, ఎస్ఐ

పశువుల సంత ఆదాయం రూ.3.36లక్షలు

అనంతపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్లో జరిగిన పశులసంతతో మార్కెట్‌కు రూ.3,36,300 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి రాఘవేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,06,200లు, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,30,100లు ఆదాయం వచ్చిందని తెలిపారు.

న్యూస్ బాక్స్

చెకుముకి సంబరాలు



సమావేశంలో మాట్లాడుతున్న గేయానంద్

కళ్యాణదుర్గం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సంబరాలను స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. జిల్లాలోని 20 మండలాల విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి.. విజేతలకు మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం గేయానంద్ మాట్లాడుతూ.. ఒక దేశ అభివృద్ధి.. ఆ దేశం సైన్స్‌కు ఇచ్చే ప్రాధాన్యతపైనే ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు కేపీ చిత్తప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి కే వీర్రాజు, జిల్లా గౌరవ సలహాదారు జి మల్లికార్జున, జ్ఞాన భారతి విద్యాసంస్థలు అధినేత రమేష్ బాబు, వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామలింగప్ప పాల్గొన్నారు.

సిరి ధాన్యాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఖాదర్ వలీ

కుందుర్పి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎనుములదొడ్డిలో సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం అనే అంశంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి పోషకాహార నిపుణుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఖాదర్‌వలీ సిరిధాన్యాల ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు, ట్రస్ట్ సభ్యులు, కోఆర్డినేటర్లు, రచయిత్రి శశికళ పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీల ఏర్పాటు



గొట్కూరులో సమావేశమైన నాయకులు

కూడేరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం సమావేశాలు నిర్వహించి గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. గ్రామస్థాయిలో పార్టీ కోసం కష్టపడిన వారికి అవకాశం కల్పించాలని మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించడంతో పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశాలు నిర్వహించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు పలువురిని ఎంపిక చేశారు.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్టి



ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్

ఉరవకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆదివారం షష్టి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వామి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమాన్ని చేపట్టారు.

గంధం ఊరేగింపు

విడపనకల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉండబండలో నాగూర్ దాదావలి ఉరుసు ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం స్వామి వారికి గంధంను ఊరేగించారు. గ్రామంలో ఒక్క ముస్లిం కుటుంబం లేకపోయినా పూర్వం ఇక్కడ వెలసిన నాగూర్ దాదాకు ఉరుసు నిర్వహించటం ఇక్కడి ప్రత్యేకత. సోమవారం ఉరుసు నిర్వహిస్తారు. మంగళవారం ఉదయం స్వామి వారి షంషేర్‌ను ఊరేగింపుతో ఈ ఉత్సవాలు ముగిస్తాయి.

టీడీపీ నాయకుడి మృతి



తిరుపాల్ (ఫైల్)

కూడేరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కరుట్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తిరుపాల్ (65) అనారోగ్యంతో ఆదివారం మరణించాడు. మృతదేహానికి మాజీ డీసీఎస్ ఛైర్మన్ సోమర జయచంద్రనాయుడు, టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

నేటి నుంచి 'రైతన్నా.. మీకోసం'

బొమ్మనహాళ్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులను నేరుగా కలిసి వారి సమస్యలు తెలుసుకోవడానికి ప్రభుత్వం రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని చేపట్టిందని, దాన్ని మండలంలో సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సాయికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఆరు రోజుల పాటు 540 కుటుంబాలతో మాట్లాడి.. పంటలు, నీరు, ఎరువులు, మార్కెట్ ధరలు, నష్టాలు తదితర కీలక సమాచారాన్ని సేకరించనున్నట్లు తెలిపారు. ఆర్ఎస్‌కే బృందంతో పాటు రెవెన్యూ, పశుసంవర్ధక, ఇంజనీరింగ్, ఎనర్జీ విభాగాల అధికారులు పాల్గొంటారన్నారు.

ప్రభుత్వాసుపత్రికి వాటర్ కూలర్ వితరణ

పామిడి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)కి సత్యసాయి సేవా సమితి సభ్యుడు శివరంగయ్య వాటర్ కూలర్‌ను ఆదివారం అందజేశారు. సత్యసాయి బాబా శత జయంతిని పురస్కరించుకొని ఈ కూలర్ అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆ సమితి అధ్యక్షుడు విశ్వనాథ్, సభ్యులు తిరుపాలయ్య, ప్రకాష్, ప్రశాంతి నారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి కుట్టుపై శిక్షణ

బెళుగుప్ప, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ కాలనీలో మహిళలకు కుట్టుపై శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి తెలిపారు. 20 మంది మహిళలకు నెల రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుంగిన పాల్తూరు పెద్ద వంక వంతెన

● రెండు వారాలుగా ఆర్టీసీ బస్సు బంద్
● ఇబ్బందుల్లో పలు గ్రామాల ప్రజలు





దెబ్బతిన్న వంతెన

విడపనకల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు పెద్ద వంకపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెనను నిర్మించి దాదాపుగా 10 సంవత్సరాలు అయి ఉంటుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ వంతెన పై నుంచి నీరు పారడంతో అది పూర్తిగా దెబ్బతిం ది. అయినా వివిధ గ్రామాల ప్రజలు అదే వంతెనపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లేవారు. రెండు వారాల క్రితం ఆ వంతెన ప్రారంభం, మధ్యలో కుంగింది. దీంతో ఉరవకొండ నుంచి పాల్తూరు మీదుగా దర్గా హొన్నూరు, గోవిదంవా డ, బొమ్మనహాలు, కనేకల్లు గ్రామాలకు వెళ్లే ఆ ర్టీసీ బస్సును అధికారులు రద్దు చేశారు. ప్రస్తు తం ఆ బ్రిడ్జి మీద ఎద్దుల బండ్లు కూడా వెళ్లటం లేదు. ద్విచక్రవాహనదారులు ప్రాణాలు అర చే తిలో పెట్టుకుని బ్రిడ్జిని దాటుతున్నారు. వంతెనకు మరమ్మతులు చేయించేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా కనకదాస జయంతి

బొమ్మనహాళ్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్‌లో ఆదివారం కనకదాస జయంతి ఉత్సవాలను కురుబ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం గంగజలం తెచ్చి కనకదాస చిత్రపటాన్ని అభిషేకించి.. పూజలు నిర్వహించారు. సాయంత్రం రథంలో కనకదాస చిత్రపటాన్ని ఊరేగించారు. 108 కలశాలతో మహిళలు ఇందులో పాల్గొన్నారు.

● గుమ్మఘట్ట : మండల కేంద్రంలో భక్త కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ఆయన చిత్రపటాన్ని ఊరేగించారు.





బొమ్మనహాళ్: ఉత్సవాల్లో పాల్గొన్న సంఘం నాయకులు, గుమ్మఘట్ట: పూజలు నిర్వహిస్తున్న నాయకులు

ఘనంగా సత్యసాయి జయంతి

తాడిపత్రి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిబాబా ఆలయ సమీపంలో ఉన్న శ్రీ సత్యసాయిబాబా మందిరంలో బాబా జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. బాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ఉరవకొండ : స్థానిక బాలసత్యసాయి శిలామందిరంలో సత్యసాయి బాబా జయంతిని ఘనంగా నిర్వహించారు.స్వామివారికి అష్టోత్తర పూజ, వేదపఠనం, సాయిచాలిసా పఠనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేత విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

● బెళుగుప్ప : మండల కేంద్రంలో పుట్టపర్తి సత్యసాయి శత జయంతి వేడుకలను ఆదివారం స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయి సేవా మందిరంలో చిత్రపటానికి పూలమాలలు వేసి భజనలు చేశారు. నారాయణ సేవా కార్యక్రమంలో భాగంగా అన్నదానం చేసి.. పేదలకు చీరలు పంపిణీ చేశారు.





తాడిపత్రిలో సత్యసాయిబాబా, ఉరవకొండలో బాలసత్యసాయి విగ్రహాల అలంకరణ

ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవం



కరస్పాండెంట్‌తో ఎన్ఎసీసీ క్యాడెట్లు

గుంతకల్లుటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్ ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సురేష్‌బాబు, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ జీ ప్రకాష్, వరలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు అంబాభవాని ఆలయ వార్షికోత్సవం

పామిడి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీలోని భావసార క్షత్రియ అంబాభవాని ఆలయ 24వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు అంబాభవాని సేవా సమాజ్ సభ్యులు ఆదివారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఉదయం అభిషేకం, కుంకుమార్చన, విశేష పూజ, రాత్రి సామూహిక కుంకుమార్చన, ఊయ్యాల సేవ, మహిళలతో ప్రాకారోత్సవం, మహా మంగళహారతి నిర్వహిస్తామన్నారు.



అంబాభవాని అమ్మవారు →

బోరు వేశారు.. వదిలేశారు..!



నిరుపయోగంగా ఉన్న బోరు

బొమ్మనహాళ్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురువళ్లి గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రెండేళ్ల క్రితం దాదాపు రూ. 40 వేలు ఖర్చు చేసి.. ఈ బోరు వేయించారు. అనంతరం దాన్ని ఇలా నిరుపయోగంగా వదిలేశారు. కనీసం దానికి చేతి పంపు అయినా అమర్చి ఉంటే.. మోటర్ కాలిపోయి తాగునీరు రానప్పుడు ఆ ప్రాంతవాసులు దాన్ని వాడుకొనేవారు.

రోడ్డు నిర్మాణం పూర్తి

కుందుర్పి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి జంబుగుంపల గ్రామం వరకు ఉన్న రహదారి అనేక సంవత్సరాలుగా అధ్వానంగా ఉంది. ఆ గుంతలు రహదారిలో వెళ్లడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. నూతన తారు రోడ్డు వేయడానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ. రూ. 2.60 కోట్లు విడుదల చేయించారు. ఆ రోడ్డు నిర్మాణ పనులు ఇటీవల పూర్తి కావడంతో ఆ మార్గంలోని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జంబుగుంపల రహదారి

ఘనంగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పామిడి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక తగ్గుదేవాలయంలో అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి, శ్రీదేవి, భూదేవి కల్యాణోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఏటా మార్గశిర మాసం మొదటి ఆదివారం రాత్రి ఇలా కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తల్లం ప్రకాష్, శివకేశవ దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు సాయిప్రకాష్, పురాణ ప్రవచకులు భాస్కరరావు, భక్తులు పాల్గొన్నారు.

తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు



తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

బొమ్మనహాళ్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్, బీసీ హాస్టల్ వద్ద తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. వందలాది మంది విద్యార్థులు నిత్యం అటుగా వెళ్తుంటారు. దీనిపై విద్యుత్ శాఖ, విద్యాశాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విద్యుత్ తీగలను సరి చేయాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

మురుగు కాలువ నిర్మాణానికి భూమిపూజ

రాయదుర్గంరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక 14వ వార్డు కోతిగుట్ట ఏరియాలో ఆంజనేయస్వామి వీధి సమీపంలో మురుగు కాలువ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. ఇందులో తెలుగుదేశం 14వ వార్డు ఇన్‌చార్జి మోహూరు అశోక్, నాయకులు వెంకటకృష్ణ, నాయకులు బత్తల శ్రీనివాసులు, బసవరాజు, కార్తీక్ పాల్గొన్నారు.

అడవిని తలపిస్తున్న జగనన్న కాలనీ



జగనన్న లే అవుట్‌లో పెరిగిన ముళ్లపొదలు

ఉరవకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక హోతూరు రహదారిలో ఉరవకొండకు రెండు కిలోమీటర్ల దూరంలో నివాసయోగ్యం కానీ చోట గత వైసీపీ ప్రభుత్వం సర్వే నెంబరు 279లో జగనన్న కాలనీని ఏర్పాటు చేసింది. 84 మందికి ఇళ్లపట్టాలను పంపిణీ చేసింది. లబ్ధిదారులు ఎవరూ అక్కడ ఇళ్లను నిర్మించుకోవడానికి ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం ఆ లేఅవుట్ అంతా ఇలా ముళ్ల పొదలతో నిండిపోయింది.

తరగతి మారేదెన్నడో..?

● అసంపూర్తిగా గదుల నిర్మాణం
● ఇబ్బందుల్లో వేపరాల విద్యార్థులు, సిబ్బంది



వరండాలో.. ఇసుకలో కూర్చున్న విద్యార్థులు

రాయదుర్గంరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపరాల యూపీ పాఠశాలను ఉన్నత పాఠశాలగా ఈ ఏడాది అప్‌గ్రేడ్ చేశారు. ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు మొత్తం 270 మంది విద్యార్థులు ఉన్నారు. దాదాపు 12 గదులు కావాల్సి ఉండగా.. కేవలం నాలుగు గదులే ఉన్నాయి. దీంతో నాడు నేడు కింద అసంపూర్తిగా ఉన్న రెండు గదులతో పాటు వరండాలో, రేకులషెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నారు. సరిపడా గదులు లేకపోవడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఆ గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా ... పాఠశాలలో గదుల కొరత తీవ్రంగా ఉందని, నాడు నేడు కింద అసంపూర్తిగా ఉన్న గదుల నిర్మాణాలను పూర్తి చేస్తే కొంతవరకు ఈ సమస్య తగ్గుతుందని తెలిపారు.



అసంపూర్తి భవనంలో...

క్రైం న్యూస్..

హైదరాబాద్‌లో కళ్యాణదుర్గం వాసి మృతి

కళ్యాణదుర్గం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కళ్యాణదుర్గం ఇందిరమ్మ కాలనీకి చెందిన కారు డ్రైవర్ ఖలీమ్ (35)అక్కడికక్కడే మరణించాడు. హైదరాబాద్ నుంచి కళ్యాణదుర్గానికి కారులో వస్తున్న సమయంలో మరో కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఖలీమ్ అక్కడికక్కడే మరణించాడు. ఖలీమ్‌కు భార్య షబానా, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ముగ్గురికి తీవ్రగాయాలు

గుత్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె మండలం కనుమపల్లి గ్రామానికి చెందిన నాగరాజు, ఆయన భార్య భారతి, ఆయన సోదరి కాంతమ్మ బైక్‌పై పట్టణ శివారులోని లచ్చానుపల్లి రోడ్డులో వెళ్తూ .. కుక్కను తప్పించబోయి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఈ ముగ్గురూ గాయపడ్డారు. స్థానికులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తాడిపత్రి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆసుపత్రి సమీపంలో ఆదివారం ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆటో నుజ్జునుజు అయింది. ఆటో డ్రైవర్ చిన్న కంబగిరి గాయపడ్డాడు. స్థానికులు అతన్ని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ సమీపంలో ముళ్లపొదల్లో ఆదివారం పేకాట ఆడుతున్న తొమ్మిది మంది అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ ఆరోహణరావు తెలిపారు. వారి నుంచి రూ.23వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

చిట్టీ డబ్బుల కోసం బాధితుల ధర్నా

గుంతకల్లుటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ధర్మవరం గేట్ రోడ్డులో నివాసముంటున్న సయ్యద్ దిల్షాద్ బేగం ఫొటో స్టూడియోతో పాటు చీటీలు నిర్వహించేది. ఇటీవల చిట్టీలు ఎత్తుకున్న వారికి ఇవ్వాల్సిన రూ.లక్షలు ఇవ్వకుండా ఆమె నిర్లక్ష్యం చేసింది. దీంతో బాధితులు ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం వరకు ఆమె ఇంటి వద్ద ధర్నా చేశారు. చీటీల డబ్బులు ఇవ్వాలని అడిగితే తనకు న్యాయవాదులు, న్యాయమూర్తులు, మంత్రులు, రాజకీయ నాయకులు తెలుసని... తమపైనే పోలీస్ కేసు నమోదు చేయిస్తానని బెదిరిస్తోందని వాపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ధర్నా విరమించాలని కోరగా... తమకు డబ్బులు ఇచ్చేంత వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని భీష్మించారు. ధర్నాలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు విజయజ్యోతి, చీటీ బాధితులు షాహీన్, పర్వీన్, కాంత, మేఘన, హలీమా, అరుణమ్మ, చాంద్‌బీ, రాబీయా, మంజుల, రాబర్ట్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బాధితులు

బాధితుడికి ఆర్థికసాయం

తాడిపత్రి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా చిప్పగిరిలోని ఓ ఆశ్రమంలో గ్యాస్ సిలిండర్ పేలడంతో అందులో పని చేస్తున్న శర్మాస్‌వలి తీవ్రంగా గాయపడ్డాడు. అతనికి ఆపరేషన్ నిమిత్తం స్థానిక ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ స్థానిక కార్యాలయంలో ఆదివారం రూ.35వేలు ఆర్థికసాయం అందజేసింది. ఇందులో ఆ సంఘం గౌరవసలహాదారు శ్రీరంగయ్య, సభ్యులు శంకర్, కరుణాకర్, చంద్రశేఖర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్ : స్థానిక పాతగుంతకల్లు బేతాళప్ప గుడి సమీపంలో నివాసముంటున్న భవన నిర్మాణ కార్మికుడు హేమాద్రి మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ నలుగురు సేవా సమితి సభ్యులు అతనికి ఆదివారం రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు. ఇందులో ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్, సభ్యులు కేశవ, చక్రపాణి, లింగేశ్వర్, రమేష్, సాయి, భాస్కర్ పాల్గొన్నారు.



తాడిపత్రి: నగదు అందజేస్తున్న సభ్యులు